ప్రజాశక్తి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

నేడు పోలమాంబ మారు జాతర

120 మందితో పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - మక్కువ

పోలమాంబ అమ్మవారి మారు జాతర మంగళవారం జరగనుంది. వనంగుడి వద్ద జరగనున్న జాతరకు దేవాదాయశాఖ ఇఒ సూర్యనారాయణ పర్యవేక్షణలో పటిష్ట ఏర్పాట్లు చేశారు. సాలూరు సిఐ రామకృష్ణ నేతత్వంలో 120 మంది పోలీసులతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే యాత్రికులకు సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి నుండి ఆర్‌టిసి బస్సులను నడపనున్నారు. అలాగే చదురుగుడి వద్ద కూడా ఎప్పటిలాగే ఏర్పాట్లు చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

తొలగింపునకు గురైన బాధితులు

న్యాయానికి తూట్లు

- హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన అధికారులు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- ఎండిఎం కార్మికులను, స్వీపర్, వాచ్‌మేన్‌లను తొలగిస్తూ తీర్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి... పంతాన్ని పెట్టుబడిగా పెట్టి ఎన్నికల నిబంధనలను అధికార పార్టీ నాయకులు తుంగలో తొక్కి పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, స్లీపర్, నైట్ వాచ్‌మేన్‌లను అన్యాయంగా తొలగించారు. గిరిజన, రజక సామాజిక వర్గానికి చెందిన వీరి కడుపుకొట్టారు. మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించినప్పటి నుంచి సుమారు 24 ఏళ్లుగా అప్పులు చేసి మదుపు పెడుతూ ఆ పథకాన్ని ముందుకు నడిపించారు. కష్టం, నష్టంలో వారి జీవితాల్లో ఏదో ఒక రోజు మంచి రోజు వస్తాదని ఎదురు చూశారు. అదే సమయంలో స్థానిక, మండల రాజకీయ రాబంధులు వారిపై కన్నెర్ర చేసి కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ పేదలైన కార్మికులను విధుల నుండి తొలగించారు. అంతటితో ఆగక ఎన్నో ఏళు ్లగాఅన్యోన్యంగా ఉన్న రజక, గిరిజన మత్స్యకారుల మధ్య కులాల కుంపటి రాజేశారు. మండలంలోని అరసాడలో చోటు చేసుకున్న ఈ పరిణామాల పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

అరసాడలోని ఎంపిపి, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో కొట్టిశ కళావతి, గొడవ పార్వతి, అరసాడ ఈశ్వరమ్మ,, గొడవ చినపార్వతి, అరసాడ అప్పిశెట్టి మధ్యాహ్న భోజన కార్మికులుగానూ, స్వీపర్, నైట్‌వాచ్‌మెన్లుగా పనిచేస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తను గత వైసిపి హయాంలో తొలగించారు. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి వచ్చాక ఆ గ్రామానికి చెందిన టిడిపికి చెందిన వారికి పాఠశాలల్లోని చోటు కల్పించేందుకు దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు ఆ గ్రామస్థాయి నాయకుడు, మండల నాయకులను, ఎమ్మెల్యేలను ఉసిగొల్పి ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై దాడులకు పాల్పడ్డారు. ఆఖరుకు పాఠశాల ఎస్‌ఎంసి కమిటీ, మండల త్రీమెన్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే, మండల, గ్రామ రాజకీయ నాయకులు వీరిని తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. మూడు నెలల నుంచి రాజకీయ నాయకుల ఒత్తిడికి గురైన వారంతా తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అధికారుల వద్దకు వెళ్తే ఎమ్మెల్యే ఒత్తిడితో వారు ఏమీ అనలేక చివరికి ఈ విషయాన్ని నీరు గార్చేశారని అన్నారు. తమను తొలగించొద్దని గ్రామ పెద్దలను, రాజకీయ నాయకులను, ఎమ్మెల్యేను కోరినా స్పందించలేదు. ఆఖరుకు వారంతా హైకోర్టును ఆశ్రయించడంతో కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జనవరి 8న కోర్టు ఫైనల్ ఆర్డర్ డిక్లేర్ చేసింది. జనవరి 29న సైన్డ్ కాఫీని పంపించింది. ఈ ఉత్తర్వు కాపీ జిరాక్సులను తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలకు బాధితులు అందజేసినప్పటికీ కోర్టు ఉత్తర్వులను వారు పక్కన పెట్టారు. ఎంఇఒ శ్రీనివాసరావు స్పందించినట్లు స్పందించి ప్రలోభాలకు లొంగి మళ్లీ వారిని తొలగించాలని ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెప్పడం గమనార్హం. మండల, గ్రామ స్థాయి రాజకీయ నాయకులు గానీ, అధికారులు గానీ స్పందించకుండా ఒకపక్క కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడమే కాకుండా ఎన్నికలు నిబంధనలు ఉన్నాయని ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం కూడా తాము విధి నిర్వహణలో లేని సమయంలో వారిని తొలగిస్తున్నట్లు ఈనెల 1న తీర్మానం చేసేశారు. ఈ విషయమై కోర్టు ధిక్కార కేసు కింద వెళ్తామని, తమకు జిల్లా అధికారులు, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను ఆధారంగా మళ్లీ విధులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

అరసాడ ఎంపిపి పాఠశాలలో పనిచేస్తున్న కార్మికులను కొనసాగించాలని కోర్టు తీర్పు ఇచ్చినా, వాటిని ఉల్లంఘించిన అధికారులపై, నాయకులపై చర్యలు తీసుకోవాలి. ప్రజలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర పనిచేస్తున్నారు. చిరు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదు. అరసాడలో గిరిజన, రజకులపై కేవలం రాజకీయ ఒత్తిడితో జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకించడంతో పాటు కోర్టు ఉత్తర్వులను అధికారులు అనుసరించి వారిని విధుల్లో కొనసాగించకపోతే కోర్టు ఉత్తర్వుల దిక్కరణపై మళ్లీ కోర్టుకు వెళ్తాం. ఇప్పటికైనా చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపకపోతే పోరాటం చేస్తాం.

కొల్లి గంగునాయుడు,
సిపిఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం.

రాజకీయ కక్షసాధింపులు మానుకోవాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో చిరుద్యోగులపై జరుగుతున్న రాజకీయ కక్ష సాధింపు చర్యలను మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సిన పరిస్థితి వస్తుంది. వెంటనే కోర్టు ఉత్తర్వులు గౌరవించి అరసాడలో అన్యాయానికి గురైన వారిని విధుల్లోకి చేర్చుకోవాలి. లేకుంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుంది. పాఠశాలలో చొరబడి గిరిజన, రజక మహిళలను మానసికంగా ఇబ్బంది పెట్టిన స్థానిక రాజకీయ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

వై.మన్మధరావు,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

వీడని చిక్కుముడి

- చైర్మన్ పీఠం గుర్తుపై అభ్యంతరాలు
- గంటకు పైగా చర్చలు
- నేటికి వాయిదా

సమావేశంలో నుంచి బయటకు వెళ్లిపోతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ పీఠం చిక్కుముడి వీడ లేదు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కేటాయించడంతో ఇప్పటి వరకూ చైర్మన్‌గా ఉన్న రాధా కుమారి వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేశారు. దీంతో ఆ పదవికి ఎన్నిక సోమవారం జరిగింది. ఎస్సీ రిజర్వ్‌డ్ చెందిన వైసిపి తరపున గెలిచిన రెండో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరికి ఆ పదవి వరిస్తుందని అందరూ భావించారు. అయితే ఇటీవల ఆమె జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో నగర పంచాయతీలో తెలుగుదేశం జెండా ఎగురవేసేలా రాజకీయాలు మొదలుపెట్టారు. దీంతో ఎమ్మెల్యే జయకృష్ణ రంగంలోకి దిగి రాజకీయ పావులు కదిపారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ యశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరిగింది. అయితే వైసిపి, కూటమి పార్టీల మధ్య చర్చలు సఫలీకృతం కాకపోవడంతో ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడింది. గంటకుపైగా జరిగిన చర్చల్లో నగర పంచాయతీలో చైర్మన్ ఎన్నికకు 18మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. టిడిపికి చెందిన ముగ్గురు, జనసేనకు చెందిన కౌన్సిలర్, అలాగే తాజాగా టిడిపిలో చేరిన ఆకుల మల్లేశ్వరితో ఎమ్మెల్యే వచ్చి కూర్చున్నారు. ఆకుల మల్లేశ్వరి తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా చైర్మన్ పదవి పోటీ చేస్తానని ఎన్నికల అధికారులు ముందు చెప్పగా, సబ్ కలెక్టర్ అంగీకరించలేదు. వైసిపి తరపున పార్టీ బి-ఫారం మీకు వచ్చిందని, కావున ఇండిపెండెంట్‌గా పరిగణంలోకి తీసుకోవడం జరగదని చెప్పారు. అలాగే వైసిపి కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే జయకష్ణ కలుగజేసుకొని రెండు పార్టీలకు ఇబ్బంది లేకుండా ఇండిపెండెంట్‌గా ఉంచుదామని కౌన్సిలర్లతో మాట్లాడారు. వైసిపి తరపున గెలిచిన కౌన్సిలర్లే ఎక్కువ మంది ఉన్నారని, నగర పంచాయతీలో తమకు బలం ఉందని ఇక్కడ చైర్మన్‌ను ప్రకటించాక మీరు తీసుకువెళ్లి మీ పార్టీ కండువా వేసుకోండి అంటూ ఎమ్మెల్యేకు వైసిపి కౌన్సిలర్లు తేల్చి చెప్పారు. దీనికి ఎమ్మెల్యే సమ్మతించలేదు. మల్లేశ్వరి పోటీ నుంచి తప్పుకుంటున్నానని మళ్లీ ఎన్నికల అధికారి ముందు చెప్పగా సమావేశం వాయిదా వేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని సబ్ కలెక్టర్ చెప్పడంతో ఎమ్మెల్యే కొంత అసహనం చెందారు. అభ్యర్థి లేకుండా ఎన్నిక ఎలా చేసుకుంటారో చేసుకోండి అంటూ టిడిపి, జనసేన కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశం మంగళవారం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికను ప్రతిష్టాత్మంగా తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి, కూటమి నేతలు పాలకొండ చేరుకొని ఈ ఎన్నికపై దృష్టి పెట్టారు. దీంతో మంగళవారం ఎలాంటి పరిణామాలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

ఎమ్మెల్యే ప్రవర్తన సరికాదు : ఎమ్మెల్సీ

నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక విధానంలో ఎమ్మెల్యే అనుసరించిన విధానం సరికాదని ఎమ్మెల్సీ విక్రాంత్ దుయ్యబట్టారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధానంలో ఎమ్మెల్యే తీరు ఆక్షేపణ ఏమన్నారు. కౌన్సిల్లో వైసీపీకి బలం ఉండే తమ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరిని బి-ఫారం ఇచ్చి ప్రతిపాదిస్తే, ఆమె ఇటీవల టిడిపి కండువా కప్పుకున్నారని తెలిపారు. వైసిపి బి-ఫారంపై కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా పరిగణలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించడం ఆక్షేపణీయమన్నారు. ఎమ్మెల్యే తన మొండితనంతో ఎన్నిక జరిపించి టిడిపికి వేయించాలని చూడటం చాలా మూర్ఖత్వం అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కళావతి, వైసిపి నాయకులు ఉన్నారు.

మూడు రీచ్‌ల టెండర్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మూడు రీచ్‌లకు సంబంధించిన టెండర్ ప్రక్రియను రద్దు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెండర్ సంఖ్య:246/2024, తేదీ: 28.12.2024న విడుదల చేసిన టెండర్‌లో వంశధార, నాగావళి తీరాల్లోని పాసుకుడి, నేరడి, చిన మంగళాపురం రీచ్‌ల్లో మాన్యుల్‌గా తవ్వకాలకు, లోడింగ్ చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. స్టాట్యూటరి అనుమతులైన రీచ్ ఏర్పాటుకు, నిర్వహణకు (Consent to Establish and Consent to Operate) జాప్యం జరిగే అవకాశం ఉన్నందున, స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్ ల కంటే తక్కువగా ధరలు కోట్ చేయడం, తద్వారా అనధికార కార్యక్రమాలు జరిగే అవకాశం ఉండడం, లేదా యంత్ర పరికరాలు ఉపయోగించే అవకాశం ఉండడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. టెండర్‌దారులు సమర్పించిన 10 శాతం సెక్యూరిటీ డిపాజిట్ తిరిగి చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులుగా గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఎన్నికయ్యారు. నెల్లూరులో ఈనెల 1 నుంచి జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలకు పార్వతీపురం మన్యం జిల్లా నుండి రాష్ట్ర కమిటీ సభ్యులుగా గంగునాయుడు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనుల నిలిపివేతపై స్పష్టత

నేడో రేపో హైకోర్టు తీర్పు ఉత్తర్వులు

ప్రజాశక్తి - సాలూరు

జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొంటూ మండలంలోని మూడు పంచాయతీల సర్పంచులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఉపాధి హామీ చట్టంలో గ్రామ పంచాయతీలకు కల్పించిన హక్కులు, ప్రయోజనాలను విస్మరిస్తూ ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఉపాధి పనులను వెండర్ పేరుతో వారి పార్టీ నాయకులు, కార్యకర్తలతో చేయించడాన్ని వ్యతిరేకిస్తూ శివరాంపురం, పారన్నవలస, పెదపదం సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. రిట్ పిటిషన్ నెంబర్ 2174/2025ను హైకోర్టు స్వీకరించిన వెంటనే ఉపాధి పనులు తక్షణమే ప్రారంభం కాకుండా చూడాలని ప్రభుత్వం తరపు న్యాయవాదులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు మండల స్థాయి అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందడం, వాటిని పనులు చేస్తున్న వెండర్లకు చేరవేయడం జరిగింది. కొద్దిరోజుల్లో ఈ కేసులో పూర్తి స్థాయిలో హైకోర్టు తీర్పు ఉత్తర్వులు జారీ కానున్నాయని న్యాయవాది రేగు మహేష్ చెప్పారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి ద్రోహం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసేలా ఉందని, రాష్ట్రానికి సరిపడే నిధులు ఇవ్వాలని సిఐటియు సాలూరు కమిటీ డిమాండ్ చేసింది. బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు టి.రాముడు, టి.శంకర్రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్రంలో ఉండే ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ఇక్కడ ఉన్న కూటమి నాయకులు నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, అన్యాయం జరిగినా రాష్ట్రానికి మోడీ చాలా చేశారని ఇంకా చేస్తారని ఇక్కడ చెబుతుండడం రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్లేనని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఇక్కడున్న పాలకులు మేల్కొని రాష్ట్రానికి రావలసిన నిధులు రప్పించుటలో ముందుండాలని లేకపోతే ఆంధ్రరాష్ట్రం మరింత వెనుకబడి పోతుందని అన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విద్యాసంస్థలు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఇవ్వాలి కానీ అటువంటి నిర్ణయాన్ని ఏ బడ్జెట్లో కూడా తీసుకోకపోవడం ఈ రాష్ట్ర దౌర్భాగ్యమని ఇక్కడ ఉన్న నాయకుల చేతగాని తనమే అవుతుందని విమర్శించారు. ఇప్పటికే జిల్లాలోని పరిశ్రమలను మూసేసి పనులు లేకుండా కార్మికులు వారి కుటుంబాలు వలసలు పోతున్నారని, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వీటిని ఆపేలా లేదా ధరలు తగ్గేలా ఎలాంటి నిర్ణయాలు చేయలేదని ఇది ప్రజలను మోసగించడమేనని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేలా, రాష్ట్రానికి మేలు కలిగేలా నిధులు వచ్చేలా కృషి చేయాలని లేకపోతే భవిష్యత్తులో ప్రజానీకాన్ని కలుపుకొని పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీను, రవి, మధు, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగలు పడ్డ ఏడాదికి...

- సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ పై విచారణ ప్రారంభం
- 5,6 తేదీల్లో 133 మంది సిఆర్‌టిలు హాజరు
- తూతూ మంత్రంగా విచారణ పై అనుమానాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో వైసిపి ప్రభుత్వ హయాంలో సిఆర్‌టిల రెగ్యులరైజేషన్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడు విచారణ చేపట్టడం దొంగలు పడిన ఏడాదికి ఐటిడిఎ అధికారులు స్పందించినట్లు కనిపిస్తోంది. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం లో ఎపిఒ మురళీధర్ సిఆర్టీలను విచారించారు. 133 మందిలో సోమవారం సగం మందిని, మంగళవారం సగం మందిని విచారణ చేపట్టనున్నారు. 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఐటిడిఎల పరిధిలో గల సిఆర్టీలను రెగ్యులర్ చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జరిగిన సిఆర్టీల రెగ్యులరైజేషన్‌కు ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. సిఆర్టీలలో ఉన్న నాయకులే అందరి నుంచి డబ్బులు వసూలు చేసిన అప్పటి గిరిజన సంక్షేమ డిడి రుక్మాంగదయ్య, కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డికి చేరాయనే ప్రచారం జరిగింది. సరిగ్గా ఎన్నికల ముందు ఈ రెగ్యులరైజేషన్ జరగడంతో అప్పటి ప్రభుత్వం విచారణకు ఆదేశించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు కావస్తోంది. ఇప్పుడు విచారణ చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న డిడి రుక్మాంగదయ్యని కొద్ది నెలల క్రితం సరెండర్ చేశారు. వసూళ్ల పర్వంలో అసలు సూత్రధారి అయిన ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిని ఆలస్యంగా పాడేరుకు డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు ఈ వ్యవహారంలో సిఆర్టీలను విచారణ జరపడం వల్ల వాస్తవాలు వెలుగులోకి రావనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులలకు క్లీన్ చిట్ ఇవ్వడానికే తప్ప ఈ విచారణ వల్ల ఉపయోగం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిఆర్టీల నాయకుల ఫోన్ పే నెంబర్లు తనిఖీ చేయకుండా మొక్కుబడి విచారణ చేయడం వల్ల ప్రయోజనం లేదనే విషయాన్ని మరుగున పెట్టి దొంగలు పడిన ఏడాది తర్వాత ఐటిడిఎ అధికారులు స్పందించడం హాస్యాస్పదమవుతోంది.

ప్రతికూల వార్తలపై అధికారులు స్పందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సంస్థాగతంగా ప్రజలకు సేవలు అందించడంలో లోపాలు పట్ల వివిధ పత్రికల్లో వస్తున్న ప్రతికూల వార్తలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అధికారి పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలందించాలని కోరారు. సూర్యఘర్ యోజన మంచి కార్యక్రమమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి అందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, వాటిపై ఎప్పటికప్పుడు అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. పల్లె పండగ పనులన్నీ ఈ మాసాంతంలోగా శతశాతం పూర్తి చేయాలని, పూర్తిచేసిన వాటికి చెల్లింపులు జరగాలని పేర్కొన్నారు. సమావేశంలో జెసి ఎస్.ఎస్.శోబిక, డిఆర్‌ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి ఎస్డీసి పి.ధర్మచంద్రారెడ్డి, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ టెక్నాలజీతో నేరాలు నియంత్రణ : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సైబర్ టెక్నాలజీ ద్వారా నేరాల నియంత్రణకు సైబర్ సెల్ ఐటి కోర్ టీం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌పి ఎస్ మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ సెల్, ఐటి కోర్ టీం అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎస్‌పి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, వీటివల్ల ప్రజలు కష్టపడి సంపాదించుకున్న నగదు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుంటున్నారని అన్నారు. కావున సైబరు మోసాలు జరగకుండా ప్రజలకు వాటి పట్ల అవగాహన కల్పించాలన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబరు క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదయ్యేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు అందేలా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. అదే విధంగా కాలానుగుణంగా మనం కూడా టెక్నాలజీపై పరిణితి చెందాలని సూచించారు. అందుకు అనుగుణంగా పోలీస్ సిబ్బంది అందరికీ సైబర్ నేరాల సాంకేతికతపై ప్రతి శనివారం శిక్షణా తరగతులు నిర్వహించాలని సైబర్‌సెల్, ఐటి కోర్ టీం అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో సోషల్ మీడియా, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై రవీంద్రరాజు, సైబర్ సెల్, ఐటి కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న మురళీమోహనరావు

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యుటిఎఫ్, ఇతర అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరుస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. ఈ మేరకు మండలంలోని కంబరవలస, వీరఘట్టం (బాలురు), (బాలికలు), కెజిబివి, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు కాలేజీలు, నర్సిపురం, గంగమ్మపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల, కత్తుల కవిటి, బిటివాడ తదితర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో యుటిఎఫ్ శ్రేణులు సోమవారం విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా మురళీమోహన్ రావు మాట్లాడుతూ విజయగౌరి విద్యార్థి దశ నుంచే ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తి ప్రారంభం రోజుల నుంచి నేటి వరకు యుటిఎఫ్‌లో సంఘంలో కీలకంగా పని చేశారన్నారు. యుటిఎఫ్ చేసే ఉద్యమాల్లో, ఫ్యాప్టో, జెఎసి చేపట్టే ఐక్య ఉద్యమాల్లో ముందు వరుసలో ఉండి సమస్యలపై గళమెత్తారని తెలిపారు. ఉన్నత పాఠశాలలో చదివే బాలికలు న్యాప్ కిన్స్ సాధించడానికి మహిళా ఉపాధ్యాయుల్ని ఏకం చేసి ఉద్యమాలు ద్వారా సరఫరా జరిగేలా పోరాడాలని తెలిపారు. కెజిబివి, ఎపి మోడల్ స్కూల్, మహిళా ఉపాధ్యాయుల సమస్యలపై జరిగే ఉద్యమాలికి నాయకత్వం వహించారని తెలిపారు. విజయగౌరిని శాసనమండలికి పంపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, కావున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయలంతా మీ మొదటి ప్రాధాన్యత ఓటును విజయగౌరికి వేసి గెలిపించాల్సి అభ్యర్థించారు. ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, మండల అధ్యక్షులు బోనంగి దుర్గాప్రసాద్, రాష్ట్ర కల్చరల్ కమిటీ సభ్యులు కొండపల్లి గౌరునాయుడు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

విశాఖ డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పార్వపురం

విశాఖ డెయిరీ ఆస్తులను లూటీ చేస్తూ ఆవు పాల సేకరణ ధర తగ్గించి, ధరలో కోత పెట్టిన విశాఖ పాల డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎపి పాల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, పాల రైతులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు సేకరణ 10శాతం తగ్గించిందన్నారు. అంత కుమునుపే నవంబర్‌లో సేకరణ ధర లీటరుకు రూ.4 తగ్గించారని, ఇలా వరుస పెట్టి పాల రైతులను కష్టపెట్టి, నష్టపరుస్తూ రైతులను నిండా ముంచుతున్నారన్నారు. పెరిగిన పశు పోషణ ఖర్చుల భారం రైతు భరిస్తూ సెంటరుకు పాలు పోస్తున్న రైతులకు న్యాయమైన ధర అందించవలసిన బాధ్యతను విస్మరించి డెయిరీ యాజమాన్యం సహకార రంగం స్ఫూర్తికి భిన్నంగా నడుస్తోందన్నారు. డెయిరీ నేడు స్వార్థపరుల అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. ప్రభుత్వం డెయిరీపై వేసిన కమిటీ విచారణను వేగవంతం చేసి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని కోరారు. డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

పంటల వివరాలను తెలుసుకుంటున్న గిరిజన రైతులు

కేరళ పర్యటనలో సీతంపేట గిరిజన రైతులు

ప్రజాశక్తి - సీతంపేట

మారిషస్ ఫైనాపిల్ పంటపై అవగాహన కల్పించడంలో భాగంగా సీతంపేట గిరిజన రైతులు సోమవారం కేరళలో పండిస్తున్న మారిషస్ ఫైనాపిల్ పంట సాగు విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మారిషస్ ఫైనాపిల్ పంట సాగు విధానాలను కేరళ రైతులు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. పంట సాగు విధానాలను హెచ్‌ఒ వెంకట గిరిజన రైతులకు వివరించారు. అలాగే ఫైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ప్రాసెసింగ్ యూనిట్‌లో ఫైనాపిల్ ప్రాసెసింగ్ చేయు విధానాలను పరిశీలించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఒ జయశ్రీ, దివాకర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ

ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల స్వాగత ఫ్లెక్సీలను ఎంపిడిఒ డిడి స్వరూపరాణి ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా? అన్న శీర్షికతో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. సోమవారం ఆ పంచాయతీల్లో కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలు

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరి అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యసనాలకు బానిస కాకుండా విద్యార్థి దశ నుంచే సక్రమంగా చదువుకొని ఉత్తమ లక్షణాలను అలవర్చుకొని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడి కుటుంబానికి భరోసాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి. నారాయణరావు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ప్రారంభించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిరసన తెలుపుతున్న గిరిజనులు

మండలంలోని లుంబేసు, మూలజమ్ము గిరిజన గ్రామాల్లో నిర్మించిన బిఎస్ఎన్ఎల్ టవర్‌ను ప్రారంభించాలని గిరిజనులు సోమవారం నిరసన తెలిపారు. పై రెండు గ్రామాల్లో టవర్ నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడంతో సెల్ నెట్‌వర్క్ సేవలు తమకు అందుబాటులో లేకుండా పోయాయని తెలిపారు. ముఖ్యమైన సమాచారం తెలుసుకోవాలన్నా, తెలియజేయాలన్నా సెల్‌ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిపిఎం మండల నాయకులు ఎం.సన్యాసిరావు తెలిపారు. లుంబేసు పంచాయతీ మారుమూల ప్రాంతం కావడంతో అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు స్పందించి సెల్‌టవర్‌ను ప్రారంభించి సమాచార వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

పారా అథ్లెటిక్స్‌లో రాజేష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని పివి ఈతమానుగూడకు చెందిన పత్తిక రాజేష్ పార అథ్లెటిక్స్‌లో బంగారపతకం సాధించాడు. రాజేష్ సీతంపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 1న మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పారా రన్నింగ్ అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో ప్రిన్సిపల్ జి.నీలంనాయుడు, కోచ్ రాజేష్ అభినందించారు. పివి ఈతమానుగూడ పంచాయతీ సర్పంచ్, తండ్రి పత్తిక వీరన్న, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎస్‌సి కార్పొరేషన్‌ను పునరుద్ధరించి ఎస్‌సి నిరుద్యోగ యువతకు చేయూతనివ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను కోరారు. ఈ విషయంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరాలని ఆయనకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర విభజనకు ముందు ఎస్‌సి కార్పొరేషణ్ ద్వారా ఎస్‌సి నిరుద్యోగులకు రుణాలు వచ్చేయని మళ్లీ అలాగే రుణాలు మంజూరు చేసి యువతను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు బీటీ నాయుడు, గుజ్జుల జనార్దన, బొత్స మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అధ్యాపకుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట పంచాయతీ వైకెఎం నగర్‌లో నివాసముంటున్న అధ్యాకుడు జాగాన శ్రీనివాసరావు (53) సోమవారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. పాచిపెంట మండలం పి.కొనవలస గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా ఈయన పనిచేస్తున్నాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. అగ్రికల్చరల్ ఎంఎస్‌సి చదివిన పెద్ద కుమార్తె వివాహం ఏప్రిల్ 21వ తేదీన జరగనున్న సమయంలో ఆకస్మికంగా ఈయన మరణించడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈయన మృతి పట్ల పార్వతీపురం ఎమ్మెల్యే బోనాల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, బొబ్బిలి చిరంజీవులు, ద్వారపురెడ్డి జగదీష్ తదితరులు విచారం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

రెవెన్యూ సమస్యలకు పరిష్కారమేది?

ప్రజాశక్తి - కొమరాడ

రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులకు నెల రోజులు గడుస్తున్న పరిష్కారం దొరకని పరిస్థితి ఉందని, ఇలా అయితే మరి రైతులకు భరోసా ఎలా అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో రైతుల భూములు ఒకరి పేరుకు బదులు మరొకరి పేర్లు నమోదు చేశారని వాటిని సరిచేయాలని ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు దరఖాస్తులు పెట్టినా యంత్రాంగం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో సుమారు 1450 దరఖాస్తులు వచ్చాయని వాటిపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద భారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులు పాల్గొన్నారు.

దళితులపై దాడిచేయించిన వారిపై కేసులు పెట్టాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలోని ఖరాసవలస దళితులపై దాడి చేయించిన సుతాపల్లి రాముపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టాలని ఆదివాసీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అప్పారావు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులపై దాడి చేయించిన రాముపై చర్యలు తీసుకుని భూమి సాగు చేస్తున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరాసవలస దళితులు సాగు చేస్తున్న భూములను కాజేయాలని దురుద్దేశంతో సాలూరు పట్టణానికి చెందిన వ్యాపారి సుతపల్లి రాము గుర్రపువలస గిరిజనులను దళితులపై ఎగదోసి దాడి చేయించి కొట్టించారని దాడి చేయించిన

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సుతపల్లి రాముపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. దళితులకు గిరిజనులకు మధ్య తగాదాలు సృష్టించి భూములను కాజేయాలని కుట్రపన్నారని పెత్తందారులైన రాముకు అధికార పార్టీ రాజకీయ అండదండలు ఉండడం వల్ల ఈ విధంగా దౌర్జన్యం చేస్తున్నారని గుర్తు చేశారు. సాలూరుకు రాము మామ నాగుల సన్యాసిరావుకు గిరిజన ప్రాంతమైన గుర్రపువలస రెవెన్యూ పరిధిలో పట్టా నెంబర్ 123 సర్వేనెంబర్ 77/2 అక్రమంగా ప్రభుత్వ భూమిని ఎలా పట్టాలిచ్చారని ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని సాగులో ఉన్న దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరాసవలస పంచాయతీ గడివలస గ్రామానికి చెందిన చోడిపల్లి బాబయ్యకు చెందిన భూమి సర్వే నెంబర్ 68/1లో సుమారు 4.13 ఎకరాలను ఆక్రమించేసి రోడ్డు, వంట షెడ్లు, లారీ షెడ్లు వేసుకుని అక్రమంగా అనుభవిస్తున్నాడని ఈ విషయమై ఇదేమని అడిగితే గిరిజనులపైన దౌర్జన్యం చేయిస్తూ బెదిరిస్తున్నాడని సంబంధిత రెవెన్యూ అధికారులు రాము భూ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి అక్రమంగా ఉన్న భూమిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్ రావు, గెమ్మెల జానకిరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, చలంబార్సి సింహాచలం, తులసమ్మ, నవీను, రాము, బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడపరాదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మద్యం సేవించి వాహనం నడపరాదని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని సురేష్ స్కూల్‌లో విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తి తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అందుకు భారీ జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేసే అవకాశం ఉందని అన్నారు. ఓవర్ స్పీడ్‌తో వాహనాన్ని నడిపి ప్రమాదాలకు గురికావద్దని తెలిపారు. పరిమితికి మించి అధికంగా ప్రయాణికులతో వాహనం నడపరాదని అన్నారు. స్కూల్ పిల్లలను తీసుకు వెళ్ళే బస్సులు, ఆటోల డ్రైవర్లు ఎక్కువ మంది పిల్లలను వాహనంలో ఎక్కించి ప్రయాణించడం వల్ల తరచు ప్రమాదాలకు గురవుతున్నారని,

పార్వతీపురం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిమితికి మించి పిల్లలను వాహనంలో ఎక్కించవద్దని కోరారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించి మాక్ టెస్ట్, క్విజ్ పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, ఎ. వరప్రసాద్, మెడికల్ ఆఫీసర్ పి.నారాయణరావు, సురేష్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

సీతంపేట: ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిని ఎస్సై వై అమ్మనరావు అన్నారు. స్థానిక పిఎంఆర్‌సి జంక్షన్ వద్ద సోమవారం యువతకు, టూవీలర్స్ వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనం బయటకు వస్తే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే సంకల్పంలో భాగంగా సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిస కాకూడదని చెప్పారు. మీ బంగారు భవిష్యత్తు మీ చేతుల్లో ఉందన్నారు. అదేవిధంగా లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, మితిమీరి వేగంతో వెళ్లరాదని, ట్రిబుల్ రైడింగ్ చేయరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి యువత ఉపయోగించుకొని జీవితంలో మెరుగైన జీవన విధానాలను అలవర్చుకోవాలని, అప్పుడే అభివృద్ధి చెందుతారని ధరణి స్వచ్ఛంద సంస్థ సిఇఒ రెడ్డి శాంతి తెలిపారు. సోమవారం తోణాం పంచాయతీ పరిధిలో గల ముంగివానివలసలో గ్రామాభివృద్ధిలో యువత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చదువుకున్న యువత ఉద్యోగ సాధనలో కాకుండా వ్యాపార అభివృద్ధిలో కూడా పాలుపంచుకొనేలా ఉండాలని అప్పుడే తమ జీవితాలు మెరుగైన జీవన ప్రమాణాలతో సుఖవంతంగా సాగుతాయని అన్నారు. దీనికోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిర్వహిస్తుందన్నారు. ఈ పథకాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకుని దీనికి తగిన విధంగా వ్యాపారం నిర్వహించి అభివృద్ధి చెందాలని కోరారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలు మిగతా యువకులకు విషయాలను తెలియజేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వికాస్, నాని, కళ్యాణ్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మస్తర్లు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలి, జోగుంపేట, నిడగల్లు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమ రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు రెండు పూటలా చేయాలని ప్రతి జాబు కార్డుదారుడు ఉపాధి పనులకు కల్పించాలని అడిగితే పనులు ఇవ్వాలని ఆదేశించారు. వేతనదారుడుకు కూలి గిట్టుబాటు అయ్యే విధంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

వేరే పాఠశాలలో విలీనం చేయొద్దు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులు వేరొక పాఠశాలలో విలీనాన్ని ఆపాలని తల్లిదండ్రులు పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.రవి మాట్లాడుతూ మండలంలోని గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. తమ గ్రామంలో పాఠశాల తరలిస్తే వచ్చిన ఇబ్బందులను తల్లిదండ్రులు వివరించారు. మా ఊరు బడి మా ఊరిలోనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు మాట్లాడుతూ గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాల 1945లో ఏర్పడిందని, పిల్లల తల్లిదండ్రులు, విద్యా కమిటీ, గ్రామస్తుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ప్రాథమిక పాఠశాలను విలీనం చేయాలని ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను విలీనం చేసే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని లేకుంటే గ్రామస్తులందరితో కలిసి ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని గొట్టమంగళాపురం ప్రాథమిక పాఠశాల కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కె.సుదర్శన్‌రావు, జి.మంగమ్మ, కె.కాంతారావు, ఎల్.సురేష్, పి.సీతమ్మ, ఎల్.సత్తమ్మ, ప్రజాసంఘాల నాయకులు కాద రాము, మజ్జి వీరన్నాయుడు, బొబ్బాది శివ, మజ్జి లక్ష్మణరావు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం ఎంఇఒకు వినతి పత్రాలు అందజేశారు.

గొట్టమంగళాపురం వాసుల ఆందోళన

నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, నాయకులు

దబ్బగెడ్డ కానా మెట్ట వద్ద చేపట్టిన తవ్వకాలు

అటవీ ప్రాంతంలో అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అటవీ ప్రాంత సమీపంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్నప్పటికీ సంబంధిత డీ పట్టా భూముల్లోనూ కూడా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దబ్బగడ్డ, పనసభద్ర, మార్కొండ పుట్టి పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఈ తవ్వకాలు రాత్రి వేళల్లో కొనసాగుతున్నట్లు సమాచారం. కాశీపట్నం పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన గ్రావెల్ మెట్ట ఉన్నప్పటికీ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలని ఉద్దేశంతో కొంతమంది ఈ అడ్డదారులు తొక్కుతూ అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారని తెలిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీ ప్రాంతంలో జరిగే అక్రమ తవ్వకాలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాజకీయాల్లోకి యువత రావాలని పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బత్తిన మోహనరావు కోరారు. సోమవారం ఆ పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, కోలా కిరణ్, సాయి శ్రీనివాస్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్వార్థంతో కూడిన నేటి రాజకీయాల్లోకి చైతన్యం కలిగిన చదువుకున్న యువత రావాలన్నారు. తాము నివసించే ఊరును బాగు చేసుకునేందుకు, తమ ప్రజలకు సేవ చేసేందుకు యువత ముందడుగు వేయాలన్నారు. స్వార్థంతో నిండిన రాజకీయ నాయకులతో గ్రామాలు, వార్డులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. వారికి దోచుకోవడమే తప్ప అభివృద్ధి చేసే ఆలోచన కానరావడం లేదన్నారు. అటువంటి వారి నుంచి తమ ప్రాంతాన్ని రక్షించి, ప్రజలకు నిస్వార్థ సేవలందించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. అలా వచ్చిన వారికి రాజకీయ శిక్షణతో పాటు వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీకి అవకాశం ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో తమ పార్టీ పాలకులు, అధికారులు చేస్తున్న అన్యాయాలను అరికట్టేందుకు పోరాడుతుందన్నారు. అటువంటి ఆసక్తి ఉన్నవారు 9550618508, 9494012244 సంప్రదించాలన్నారు.

గిరిజన భూముల్లో మొక్కలు పెంపకం అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనులకు జీవనాధారమైన భూములలో అటవీ శాఖ అధికారులు మొక్కలు పెంపకం చేపట్టడం అన్యాయమని సిపిఎం మండల నాయకులు పి.రాము అన్నారు. ఈ మేరకు సోమవారం డోకిశీల గ్రామ సచివాలయ అధికారులకు గిరిజనులతో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోకిశీల పంచాయతీ పరిధిలో పలు గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను గుర్తించి ప్రభుత్వం వారికి ఆర్ఒఎఫ్ఆర్, డిపట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఇటీవల భారత ప్రభుత్వం

సచివాలయంలో అధికారికి వినతినిస్తున్న గిరిజనులు

చేపట్టిన భారతమాల పథకంలో భాగంగా విశాఖపట్నం నుండి జైపూర్ జాతీయ రహదారి నిర్మిస్తున్నందున, సదరు భూములలో కోల్పోయిన అటవీ సంపదకు బదులుగా ప్రత్యామ్నాయంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టారని అందులో భాగంగా డోకిశిల పంచాయతీలోని గంజి గడ్డ, కొయ్యమెట్ట గ్రామాలలోని తమ భూములలో మొక్కలు పెంచడానికి సిద్ధమవుతున్నట్లు తెలియచేశారని అన్నారు. దీని వల్ల ఆ ప్రాంతాలలోని గిరిజనులు జీవనాధారం కోల్పోతారని కనుక ఐటిడిఎ అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని మొక్కలు వేయకుండా కార్యక్రమాన్ని నిలుపదల చేయాలని కోరారు. అనంతరం సచివాలయంలో రెవెన్యూ అధికారులకు వినతి అందించారు.

గిరిజన మత్స్యకారులకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన మత్స్యకారులకు ఆర్థికంగా భరోసాను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ అన్నారు. మండలంలోని గుజ్జువాయి రిజర్వాయర్‌లో సోమవారం 54వేల చేప పిల్లలను, 10 డిపార్ట్మెంట్ చెరువుల్లో 2 లక్షల 28,900 చేప పిల్లలను, జియ్యమ్మవలస మండలంలోని రావాడ రాంభద్రపురం, పరజపాడు, చినమేరంగి పరిధిలో గల వట్టిగెడ్డ రిజర్వియర్‌లోనూ, 9 డిపార్ట్మెంట్ చెరువుల్లో లక్షా 74,900 యర్రా మల్లెలు, రాగండి, దిట్ట జాతికి చెందిన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు గిరిజన ఉప ప్రణాళిక పథకంలో ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బిసిలకు 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందని, కావున ఈ అవకాశాన్ని గిరిజన మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయకులు కె.ఇంద్రజ, ఎన్.సురేష్, శోభన్, మత్స్యకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని నులకజోడులో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా శ్రీ రామ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు రాయితీపై 30,800 చేప పిల్లలును సోమవారం పంపిణీ చేశారు. రాయితీపై అందిస్తున్న చేప పిల్లలను సద్వినియోగం చేసుకోవాలని భామిని మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ అన్నారు. కార్యక్రమం నిమ్మక విజేత, మత్స్య కారులు పాల్గొన్నారు.

చేప పిల్లలను నీటిలో విడిచిపెడుతున్న అధికారులు

ఘనంగా అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - కురుపాం

వసంత పంచమి సందర్భంగా సోమవారం స్థానిక విజ్ఞాన భారతి, సరస్వతి విద్యా నికేతన్‌ల్లో వేద పండితుల మధ్య బాల బాలికలకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించి యజ్ఞం చేసిన తర్వాత బాలబాలికలకు అక్షరాభ్యాసం చేపట్టారు. ప్రతి ఏటా వసంత పంచమి రోజున అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న వారికి సిబ్బంది పలక, బలపం అందించారు.

అక్షరాభ్యాసంలో పాల్గొన్న పిల్లలు, తల్లిదండ్రులు

వివేకానంద విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో...

సీతంపేట : స్థానిక పిఎంఆర్‌సి సమీపంలో ఉన్న వివేకానంద విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఫీజుతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ వి.సాయికృష్ణ శర్మ, కందుల రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి పల్లెబాట

ప్రజాశక్తి - సీతానగరం

రానున్న ఉగాది నుంచి ప్రతి గ్రామం సందర్శించి ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కలుసుకోనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. సోమవారం సీతానగరంలోని వైసిసి నాయకులు ఆర్‌వి స్వగృహంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి నియోజకవర్గం వరకు మరింత బలోపేతం చేసేందుకు సిద్ధమవుతున్నామని, కావున పార్టీ శ్రేణులంతా నూతన ఉత్సాహంతో యాక్టివ్‌గా పనిచేయాలన్నారు. నెలలో ప్రతి వారం కార్యకర్తలతో సమావేశం జరుగుతుందన్నారు. పార్టీ ఓటమి చెందిన అనంతరం ఇప్పటి వరకు ఏవిధంగా ఐతే సమిష్టిగా ఉన్నారో అలానే భవిష్యత్లో కూడా అందరూ ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన ఆవశ్యకత మన అందరిపై అన్నది అని కావున అందుకు తగ్గట్టుగా మీరంతా కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, వైస్ ఎంపిపిలు, జిల్లా పార్టీ ప్రతినిధులు ముకుంద, శ్రీనివాసరావు, నియోజకవర్గ స్థాయి మహిళా విభాగం అధ్యక్షులు దాసరి నాగరత్నం, రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ, రాష్ట్రస్థాయి విభాగాల అధ్యక్షులు శివ, తవుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - సీతానగరం


సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ జగన్‌మోహనరావు

హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల్లో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. నిడగల్లు, కెడివలసలో వెల్నెస్ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు, ఆరోగ్య సర్వేల నిర్వహణ తీరు పరిశీలించారు. ప్రతి రోజూ ఆరోగ్య కేంద్రాల్లో విధిగా ఒపి నిర్వహించాలని, ప్రజల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకొని తగు వైద్యం అందించాలని సూచించారు. మందుల లభ్యత పరిశీలించి సకాలంలో సద్వినియోగం చేయాలన్నారు. కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కార్యక్రమాల రీత్యా కేంద్రం నుంచి వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. వైద్య పరికరాల పనితీరును పరిశీలించి అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సేవలు ప్రజలు వినియోగించాలన్నారు. తగు నిర్దేశం చేస్తూ వైద్య అవసరాల నిమిత్తం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాస లేకుండా చూడాలన్నారు. దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రక్త హీనతనివారణపై సమిష్టి కృషి చేయాలన్నారు. హెల్త్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ధరణి, సంధ్య, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి సంఘటన మండలంలోని కర్రివలసలో ఆదివారం జరిగింది. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం గొల్లలపేటకు చెందిన కుంభంగి రామారావు కర్రివలసలో గత నాలుగు రోజులుగా షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఆదివారం యధావిధిగా పనులు చేస్తుండగా ఇనుప పైపు పైకి ఎక్కిస్తుండగా పైనున్న విద్యుత్ వైర్లకు పైపు తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు సాలూరు సిహెచ్‌సికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కృపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.